

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**హో శివ్ జీ బిహానె చలె పాల్‌కీ సజాయ్‌కె**

**బిభూతి లగాయ్ కె లా**

'మునిం జీ' సినిమాలో ఎస్డీ బర్మన్ సంగీత దర్శకత్వంలో శైలేంద్ర రచించగా హేమంత్ కుమార్ పాడిన పాట ఇది. యవ్వనంలో ఉన్న ముసలి మునిం వేషం వేసుకున్న దేవానంద్ పాడతాడీ పాటను సినిమాలో. ఇదొక నృత్యరూపకం. బాలే లాంటి గీతం. సినిమాలో స్టేజీ మీద శివ పార్వతి పరిణయమనే నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తారీ సన్నివేశంలో. శివుడిగా సాంచీ శంకర్, పార్వతిగా అమిత నటించారు. ఈ నృత్య నాటకాన్ని చూసే వారిలో నాయిక నళిని జయవంత్, విలన్ ప్రాణ్‌లు ఉంటారు. నిజానికి సినిమాలో అనవసరం ఈ పాట. ఈ పాటను కత్తిరించినా సినీగమనానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదు. కేవలం నాయికకు ప్రాణ్ నచ్చలేదని చూపించేందుకు ఉపయోగపడుతుందీ పాట. నృత్యాన్ని తన్మయమై చూస్తూన్న నళిని జయవంత్ చేయిపై చేయి వేస్తాడు ప్రాణ్. ఆమె అతడి చేయిని సున్నితంగా తప్పిస్తుంది. కథాపరంగా అంతకన్నా విలువలేదీ పాట దృశ్యానికి.

కానీ అత్యద్భుతమైన పాట. పదే పదే చూసి ఆనందించాలనిపించే పాట. ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించగలిగేపాట. అదీగాక, పాతకాలం సినిమాలలో అవకాశం ఉన్నా లేకున్నా ఒక నృత్యగీతాన్ని చొప్పించటం తప్పనిసరిగా చేసేవారు. ఈ గీతాలు మన పురాణ గాథలలో, సంస్కృతి, సంప్రదాయాలనో ప్రతిబింబించేవి. అందువల్ల ప్రేక్షకులకు కనీసం ఆ గాథలు, నృత్యాలు, సంస్కృతి కొద్దిగానయినా పరిచయం అయ్యేవి. మాయాబజార్ మోహిని భస్మాసుర నృత్యం ఇలాంటిదే. అలాగే 'ఆరంభంలో శ్రీకృష్ణుడి బాల్యానికి సంబంధించిన పాట ఇలాంటిదే. కానీ దాన్ని కథలో అత్యద్భుతంగా భాగం చేయటం స్క్రిప్టు రచయిత ప్రతిభ. అలాగే ఏదో ఓ రూపంలో నాయికతో శాస్త్రీయ నృత్యం పెట్టేవారు. ఇలా ఆ కాలంలో సినీ కళాకారులు ఏదో ఓ రకంగా మన సంస్కృతి సంప్రదాయాలను, కళలను తెరపై ప్రదర్శించేవారు. ఆ సందర్భంగానైనా ఓ శాస్త్రీయ సంగీతం పాట, ఓ శాస్త్రీయ నృత్యం, ఓ పౌరాణిక రూపకం, గానం రూపంలో జొప్పించేవారు. అలాంటి పాట ఇది.

శివపార్వతుల వివాహం ఒక నృత్యరూపకంలా ప్రదర్శితమవుతుంది. పాట రాసింది శైలేంద్ర. శైలేంద్ర ఒక్క పదం కూడా వ్యర్థంగా రాయడు. అనవసరంగా కవిత్వపు పోకడలు పోడు. వర్ణనలుండవు. తిన్నగా సారం ప్రదర్శిస్తాడు. అసలు విషయానికి వస్తాడు. లోతైన భావాలను ప్రదర్శిస్తాడు. ఈ పాట ప్రత్యేకత ఏమిటంటే శైలేంద్ర పాటలో వాడిన పదాలు భోజ్ పురి ప్రాంతంలో వాడే పదాలు. హిందీకూడా అటు గ్రాంథికం, ఇటు మాండలీకం నడుమ కొట్టుమిట్టాడుతుంది. మామూలుగా ఈ పదాలు అర్థంకావు. కానీ తెరపై ప్రదర్శితమైయ్యే కొరియోగ్రఫీ ఎంత అద్భుతంగా ఉంటుందంటే, పదాలు వింటూ, దృశ్యం చూస్తూంటే భావం బోధపడిపోతుంది. ఇలాంటి కొరియోగ్రఫీ ఇంతవరకూ భారతీయ చలనచిత్రాలలోనే లేదనటం అనృతం కాదు. అతిశయోక్తికాదు.

బిహానే అంటే బ్యాహ అంటే వివాహం. 'శివ్ జీ బ్యాహనే చలే ' అంటే శివుడు వివాహం చేసుకోవటానికి వెళ్తున్నాడు అని అర్థం. అదీ ఎలా వెళ్తున్నాడంటే పల్లకీలో, ఒళ్లంతా విభూతి పూసుకుని. వివాహానికి వెళ్లేవారు మిగతా రోజుల్లో ఎలా ఉన్నా కనీసం పెళ్లికొడుకులా

వెళ్లేటపుడన్నా శుభ్రంగా అలంకరించుకుని వెళ్తారు కానీ శివుడికి విభూతి అలంకారం. మెడలో సర్పం ఆభరణం. జటాజూటం అతని హెయిర్ స్టయిల్. ఎలాంటి కృత్రిమత్వం లేకుండా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ప్రాకృతికంగా, స్వాభావికంగా శివుడు వివాహానికి తరలి వెళ్తున్నాడు.

**ఓ జబ్ శివ బాబా కరే తయ్యారీ**

**కైకే సకల్ సామాన్ హో**

**దాహినే అంగ్ త్రిశూల్ విరాజ్ హో**

**నాచే భూత్ షైతాన్ హో**

శివుడు పెళ్లికి తయారీలు చేస్తున్నాడు. సకల సామానులు సిద్ధం అయ్యాయి. అతడి కుడివైపున త్రిశూలం ఉంది. వివాహం శివుడిది. శివుడు భూతనాథుడు. దాంతో భూతాల్, షైతాన్‌లు అన్నీ ఆనందంతో నృత్యం చేస్తున్నాయి. ఎలాంటి అతిశయోక్తులు, అలంకారాలు లేని సామాన్య వర్ణన. కానీ మాములు పదాలలో ఉన్న ఈ వర్ణన తెరపై నృత్యం వల్ల అత్యద్భుతంగా అనిపిస్తుంది. ఇక్కడ ఒక కిటుకు ఉంది.

తెరపై శివుడి కింకరులు కనిపిస్తారు. వారంతా నృత్యం చేస్తూంటారు. వారితో సమానంగా శివుడు నృత్యం చేస్తూంటాడు. ఒక్కసారి దృశ్యం చూస్తే చాలు మనసుకు ఒక భావన బలంగా తాకుతుంది. తెరపై వారి ప్రతికదలిక ఒక అత్యద్భుతమైన నృత్యంలా తోస్తుంది. చేతుల కదలికలు, చేతుల వ్రేళ్ల కదలికలు, కనుల కదలికలు, కనుబొమ్మల కదలికలు, అధరాల కదలికలు, వదనం కదలికలు, ఒకటేమిటి వాళ్ల శరీరంలో ప్రతి అంగం నృత్యం చేస్తున్న భావన కలుగుతుంది. ప్రతీభావన అద్భుతం అనిపిస్తుంది. పదాలలోని సింప్లిసిటీ వల్ల వారి ప్రతి కదలిక శక్తి మరింత ఇనుమడించినట్టు తోస్తుంది. అదే పదాలలో ఆడంబరం ఉంటే వారి కదలిక నుంచి దృష్టి పదాలవైపు మళ్లేది. ఇది దృశ్య మాధ్యమానికి మాటగానీ పాటగానీ రాయాల్సిన పద్ధతి. సాధారణంగా కవులు వర్ణనలపై మోజు పడతారు. పదాలతో చిత్రాలు సృజించాలని తపన పడతారు. కానీ దృశ్యమాధ్యమంలో వెయ్యి పదాలు చేసే పని ఒక సెకను కనబడే దృశ్యం చేస్తుంది. వెయ్యి పదాలలో వర్ణించే భావనలను ఒక ముఖ కదలిక ప్రదర్శిస్తుంది. కాబట్టి దృశ్యం చూపించేదానికి పదం complimentary గా ఉండాలి తప్ప decsriptive గా ఉండకూడదు.పదం దృశ్యంలో మిళితమై పోవాలి తప్ప దృశ్యాన్ని పదం డామినేట్ చేయకూడదు. అందుకే శైలేంద్ర అతి సరళమైన పదాలు వాడాడు. ఇది దృశ్యమాధ్యమాన్ని అర్థం చేసుకున్న కవి మాత్రమే చేయగల పని.

మరో విశేషం ఏమిటంటే, శివుడు ఆటవికుడిలా, గిరిజన జాతివాడిలా కనిపిస్తున్నాడు. పులిచర్మం కట్టుకున్నాడు. త్రిశూలం ధరించాడు. మెడలో పాము వేసుకున్నాడు. చుట్టూ భూతగణాలున్నాయి. వారు ఆటవికులులా ఉన్నారు. అలాంటప్పుడు వారికి నాగరీక భాష శుద్ధ హిందీలో పాట రాయ వీలులేదు. అందుకని శైలేంద్ర భోజపురి పదాలను అధికంగా వాడుతూ పాట రచించాడు ఔచిత్యం పాటించాడు.

**బ్రహ్మ చలె విష్ణూ చలె లైకే వేద్ పురాన్ హో**

**శంఖ చక్ర ఔర్ గదా ధనుష్ లై చలె శ్రీ భగవాన్ హో**

తెరపై కనపడే దృశ్యాన్ని వివరిస్తున్నాడు. తెరపై బ్రహ్మ విష్ణు వంటివారి కదలికలు నృత్యమే అత్యద్భుతంగా, లయ బద్ధంగా ఉంటుంది. బ్రహ్మ విష్ణువులను వర్ణించిన కవి శివుడి దగ్గరకు వచ్చేసరికి గమ్మత్తయిన వర్ణన చేశాడు.

**ఔర్ బన్ ధన్ కె చలె బం భోలా**

**లీహె భాంగ్ ధతూర్ కా గోలా**

**బోలే యే హర్దం చలే లడ్కా పరాయ్ హో.**

శివుడు అలంకరించుకుని టిప్‌టాప్‌గా బయలుదేరాడు. భంగు తీసుకుని కల్లుతాగుతూ బయలుదేరాడు. ఈ సందర్భంలో శివుడి పాత్రధారి కల్లుకుండను పట్టుకుని తాగినట్టు చేయటం ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. ఏమి నృత్యం అది? నిత్య జీవితంలో ప్రతి కదలిక ఓ నృత్యమే అనిపిస్తుంది. తాను తాగి అందరికీ తాగించి ఊగుతూ శివుడు నడవటం మహాద్భుతమైన నృత్యం.

శివుడు వివాహానికి వస్తున్నాడు. ఇక్కడ కోరస్ పాడతారు

**కోయీ ఆయీ, కోయీ ఆయా.**

'ఎవరో వస్తున్నారు. ఎవరో వచ్చారు'

ఇక్కడ సంగీతం మారుతుంది. శివుడు, భూతగణాలు ఎగిరెగిరి చూస్తూంటాయి. తెరచాటునుంచి వరమాల పట్టుకుని పార్వతి వస్తుంది. వారి చుట్టూ భూత గణాలు చేరతాయి. ఇతరులు బెదురుతారు. పార్వతి బెదరదు. అందంగా నృత్యం చేస్తూంటుంది. సంగీతం మారుతుంది. నృత్యం చేస్తూ శివుడు వస్తాడు.

అసలు ఈ పాట చూస్తూంటే ప్రతిక్షణం, ప్రతి ఒక్కరి కదలిక అద్భుతం అనిపిస్తుంది. ఆరంభంలో పాము విగ్రహం చాటునుంచి ప్రమధగణాలు నృత్యం చేస్తూ రావటం నుంచి ఓ నృత్య కావ్యం మొదలయిన భావన కలుగుతుంది. ప్రతి ఒక్క కదలిక ఒక కవిత అనిపిస్తుంది.

**ఓ మాతా మత్ దిన్ పర్ చచల్ లి తిలక్ జలి లీలార్ హో**
**కాలా నాగ్ గర్దన్ కె నీచే వోహు దిలన్ ఫుస్కార్ హో**
**లోటా ఫేక్ కె భాగ్ చలీలి తావిజ్ నిఖల్ లీలార్ హో**
**ఇన్‌కి సంగి బిబాహ్ నకర్ చో గౌరీ రహి కున్వారీ హో...**

పార్వతి తల్లి తిలకం పెట్టాలని వచ్చింది. శివుడి మెడక్రింద ఉన్న నల్లనాగు బుస్సుమంది. అది చూసి ఆమె పళ్లెం విసిరి భయంతో పరుగెత్తింది.

పళ్లెం భయంతో విసిరి పరుగెత్తిన ఆమె పార్వతి జీవితాంతం కన్యగా ఉన్నా సరే ఇతడితో పెళ్లికి ఒప్పుకోను అని భీష్మించుకుకూర్చుంది. మళ్లీ ఇప్పుడు పాట మారుతుంది.

పార్వతి తల్లిని వేడుకుంటుంది. ఉండేది కొద్దిసేపే అయినా పార్వతిని చూస్తే జాలి వేస్తుంది. పార్వతిలా అమిత నృత్యం అత్యద్భుతంగా ఉంటుంది. మాలపట్టుకుని నృత్యం చేస్తూ కనిపించిన క్షణం నుంచీ మనసు దోచేస్తుంది అమిత.

**కహే పార్వతి సంఝాయీ బతియా మానో హమారి మాయీ**
**జై భరైలే హ హం కరంవా లిఖాకే**

పార్వతి తల్లిని బ్రతిమలాడుతుంది. నా అదృష్టం ఎలా రాసిపెట్టి ఉంటే అలా అవుతుంది. కాబట్టి నాకు శివుడితో పెళ్లి చేయమని వేడుకుంటుంది. ఈ సందర్భంలో పార్వతి తల్లిని వేడుకుంటుంటే శివుడు హాయిగా in gay abandon, ఎలాంటి చీకు చింతా లేకుండా నృత్యం చేస్తూంటాడు. అది చూస్తూంటే ఒక్క చిన్న దృశ్యంలో ఎంత గొప్పగా పాత్రల వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తున్నాడో అనిపిస్తుంది. పాట కథను చెప్తోంది. కథలో చెప్పనిది దృశ్యం చెప్తోంది.

**ఓ జబ్ శివ్ బాబా జబ్ మద్వా గైలే, హోలా మగలా చార్ హో**
**బాబా పండిత్ వేద్ విచారే హోలా గుస్సా చార్ హో**
**బజరబాతి కి లగి ఝూలరి నాగిన్ కి అధికార్ హో**
**విజ్ మద్వా మె నావన్ ఐలి**

**కరే ఝుగన్ వడియార్ హో ఈ గో నాగిన్ గిలె విదాల్**

**నావన్ గియులె చలె బరాతి చలే దేవతా థాథాయ్ కే**

వివాహం జరుగుతుంది. ఏడడుగులు వేస్తారు. పార్వతి శివుడి చేయిపట్టుకుని అగ్నిలో స్వాహా అంటూ వేయటం నృత్యం. అలంకారు అందరూ నృత్యాలు చేస్తారు. శివుడు పామును పళ్లెంలో వేస్తాడు.అప్పుడు పొట్ట పట్టుకుని శివుడు నవ్వటం ఓ అద్భుతం. శివపార్వతుల నృత్యం పరమాద్భుతం. సంగీతం మారుతుంది. తన రూపం మార్చమని పార్వతి శివుడిని అభ్యర్థిస్తుంది.

**తో కోమల్ రూప్ ధరే శివ్ శంకర్ ఖుషీ భయే నర్-నారీ హో**

**రాజహి నాచన్ గాన్ కరైలే ఇజ్జత్ రహే హమార్ హో**

**రహే వర్ సాథి శివ్ శంకర్ సె కేహు కె న పావల్ పార్ హో**

**ఇంకే జటా సే గంగా బహలీ మహిమ అగం అపార్ హో**

అద్భుతమైన సంగీతం, నృత్యం నడుమ శివుడు తన రూపాన్ని కోమలంగా, నాగరీకంగా మార్చుకున్నాడు. అందరూ సంతోషించారు. నృత్యం చేశారు. హిమవంతుడు పార్వతిని శివుడికి అప్పగించి కాపాడమన్నాడు. శివపార్వతులు సంతోషించారు. వర్షాకాలం రాగానే నది దాటారు. శివుడి జటాజూటం నుంచిగంగ హర్షంతో వర్షించింది. శివుడి మహిమలు అపారం.

**జై శివ్ శంకర్ ధ్యాన్ లగాయే ఇంకో తీనో లోక్ దిఖాయే**

**కహే దుఖ్ హరన్ యహి ఛడో బనోవా కె**

శివుడిని ధ్యానిస్తే ముల్లోకాలు ప్రాప్తిస్తాయి. దుఃఖం దగ్గరకిరాదు అంటున్నాడు కవి.

ఆ పై నృత్యం చేస్తూ ప్రమథగణాలతో శివపార్వతులు స్వస్థలం వెళ్లిపోతారు.

'సర్వేజనా సుఖినో భవంతు' ఇదీ పాట.

అసలు ఇదొక మహాద్భుతం. సినిమా మొత్తం ఒక ఎత్తు. ఈ ఒక్క పాట ఒక ఎత్తు అనిపిస్తుంది. పాట మధ్య మధ్యలో దేవానంద్ కనిపించి తెరపై చూపలేని వాటిని పాడుతూ చూపిస్తాడు.

ఉత్తరప్రదేశ్ హిందీ, భోజ్ పురి మాండలికాన్ని కలిపి శైలేంద్ర అద్భుతంగా రచించిన ఈ పాట ఎస్డీ బర్మన్ సంగీత దర్శకత్వం వహించిన పాటలన్నిటికీ భిన్నంగా ఉంటుంది. ఎస్డీ బర్మన్ ప్రధానంగా ఈశాన్య ప్రాంత సంగీతాన్ని భారతదేశమంతా వినిపించిన వ్యక్తి అతని పాటలలో అతడి పలుకులు, వాయిద్యాలు, జానపదాలు, పడవ నడిపేవారి భటియాలీ పాటల పరిమళాలు, రవీంద్ర సంగీతపు మృదుమధురిమలు తొణికిసలాడతాయి. అతని ఆర్కెస్ట్రా కూడా చాలా పరిమితం. ఒక వేణువు, తబలా ఢోలక్ ఉంటే చాలు అతనికి. కానీ ఈపాట అందుకు భిన్నం. పాట తిరిగే మెలికలు అపరిమితం. వాయిద్యాల కదలిక అమోఘం. కానీ ఇది వింటూంటే ఈ పాటలో ఎస్డీ బర్మన్ ఛాయలు కనిపించవి. దీని వెనుక ఒక కథ చెప్తారు.

ఎస్డీ బర్మన్‌కు ఆర్కెస్ట్రా అంటే పడదు. అతను సంగీత దర్శకత్వం ఆరంభించిన తొలిదినాల్లో సంగీత దర్శకుడు సి.రామచంద్ర ఆర్కెస్ట్రాలో అతడికి సహాయం చేశాడు. తరువాత జయదేవ్ అతని సహాయ సంగీత దర్శకుడిగా నేపథ్య సంగీతాన్ని, పాటల్లో ఇంటర్ల్యూడ్ సంగీతాన్ని కూర్చాడు. ఎస్డీ బర్మన్ పల్లవి బాణీ కట్టి చరణాలు తయారు చేయటం, ఇతర సంగీతపరమైన అంశాలను సహాయ సంగీత దర్శకులకు వదిలేసేవాడని, వారు తయారు చేసిన దాన్ని ఎస్డీబర్మన్ విని మెచ్చిన తరువాతనే పాట రికార్డింగ్ పూర్తయ్యేదనీ, ఇలా ఎస్డీ బర్మన్ మెప్పు పొందే చరణాలు, సంగీతాన్ని సృష్టించటం కోసం తానూ, జయదేవ్ పోటీపడేవారమని ఆర్డీ బర్మన్ స్వయంగా వెల్లడించాడు. అలా,

ఆర్కెస్ట్రా అంటే అంతగా పడని ఎస్డీ బర్మన్ ఇంత అత్యద్భుతమైన పాటను రూపొందించటం ఆశ్చర్యం కలిగిస్తుతంది. కానీ, ఈ దృశ్యంలో శివుడి పాత్రధారి సచిన్ శంకర్ లేక సాంచీ శంకర్ అని తెలిస్తే అంత ఆశ్చర్యం కలిగించదు.

సాంచీ శంకర్ ఉదయ్ శంకర్, రవిశంకర్‌ల బంధువు. ఉదయ్ శంకర్ వద్ద నృత్యం అభ్యసించాడు. 'సచిన్ శంకర్ బాలే యూనిట్'ను ఏర్పాటు చేసి తనదైన ప్రత్యేక నృత్య పద్ధతులను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ దృశ్యంలోని భూతగణాలన్నీ అతని ట్రూపులోనివారే. సచిన్ శంకర్ నృత్య పద్ధతిలో 'బాలే' కదలికలను, ఒడిస్సీలయను, కదలికలను, కథక్ భంగిమలను జోడించి అత్యద్భుతమైన నృత్యాన్ని సృజించటం ఉంటుంది. దేశమంతా తిరుగుతూ బాలే నృత్య రూపకాలను ప్రదర్శించి అలరించింది సచిన్ శంకర్ ట్రూపు. ఆ ట్రూపు రూపొందించిన బాలే ఇది. ఆ ట్రూపుకు సంగీత దర్శకుడు పండిట్ రవి శంకర్. అంటే సినిమాలో పాటలన్నీ ఎస్డీ బర్మన్ పేరు మీద ప్రకటించినా, ఈ పాటను రూపొందించింది మాత్రం రవిశంకర్ అన్నమాట. ఆ కాలంలో ఇలాంటివి సర్వసాధారణం. నటి భానుమతి తన పాటలకు తానే సంగీత దర్శకత్వం వహించుకునేది. సినిమాలో ఇతర పాటలన్నీ వేరే సంగీత దర్శకుడు రూపొందించేవాడు. కానీ సంగీత దర్శకుడిగా అతడి పేరే వేసేవారు. అలా ఈ పాటను సచిన్ శంకర్, అతని ట్రూపు కొరియోగ్రఫీ చేసి, రవిశంకర్ రూపొందించినా ఇది ఎస్డీ బర్మన్ పేరు మీదే చలామణీ అవుతోంది. అత్యద్భుతమైన ఈ పాట, ఈ దృశ్యం అందుకే భారతీయ చలనచిత్ర చరిత్రలో అపూర్వమై, అద్వితీయంగా నిలుస్తోంది.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments